ఉద్యోగాల ఊసెత్తని సర్కారు

- గత ప్రభుత్వంలో వైద్యశాఖలో 560 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు జారీ
- 20 వేలకు పైగా వచ్చిన దరఖాస్తులు
- ఎన్నికల ముందు నిలిచిపోయిన ప్రక్రియ
- కొత్త ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలైనా అతీగతీ లేదు

తాము అధికారంలోకి వస్తే ఇంటికో ఉద్యోగం కల్పిస్తామని ఊదరగొట్టిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదు. కొత్తగా ఉద్యోగాలు ఇవ్వకపోగా ఉన్న ఉద్యోగాలకు సైతం ఎసరు పెడుతోంది. గత ప్రభుత్వ హయాంలో నోటిఫికేషన్ జారీ అయ్యి మెరిట్ జాబితా కూడా ప్రకటించిన పోస్టులకు కూడా ఓకే చెప్పలేని దుస్థితిలో ఉంది. దీంతో ఉద్యోగాలపై ఎన్నో ఆశలు పెట్టుకున్న నిరుద్యోగులు కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. ఉద్యోగాలు వస్తే తమ జీవితాలు బాగుపడతాయని ఆశించిన వారికి నిరాశ తప్పేలా లేదు.

కర్నూలు(హాస్పిటల్): ప్రభుత్వ ఆసుపత్రులు, మెడికల్ కాలేజీలు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు ఇలా వైద్యరంగంలో ఎక్కడా ఒక్క పోస్టు కూడా ఖాళీ ఉండకూడదన్న ఉద్దేశంతో ఎప్పటికప్పుడు ఖాళీ అయిన పోస్టులను భర్తీ చేసుకుంటూ పోయింది గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. ఖాళీ అయిన పోస్టులే కాదు అవసరమైన చోట కొత్త పోస్టులు సృష్టించి మరీ ఉద్యోగాలు కల్పించింది. కోవిడ్ సమయం నుంచి వైద్యశాఖలో నిత్యం ఉద్యోగాలకు సంబంధించి నోటిఫికేషన్లు జారీ కావడం, వందల సంఖ్యలో నిరుద్యోగులు పోస్టులకు దరఖాస్తులు చేసుకోవడం, ఎవ్వరికీ ఒక్క రూపాయి ఇవ్వాల్సిన అవసరం లేకుండా మెరిట్ ఆధారంగా ఉద్యోగాలు పొందడం అప్పట్లో కనిపించేది. ఈ క్రమంలో గతేడాది నవంబర్‌లో, ఈ యేడాది జనవరి, ఫిబ్రవరిలో వైద్యశాఖ మూడు నోటిఫికేషన్లు జారీ చేసింది. వీటి ద్వారా కొత్తగా మంజూరైన నంద్యాల, ఆదోని మెడికల్ కాలేజీలతో పాటు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల, కర్నూలు మెడికల్ కాలేజి, వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని పీహెచ్‌సీ, స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో పోస్టులు భర్తీ చేసేందుకు చర్యలు తీసుకున్నారు. మూడు నోటిఫికేషన్లకు గాను 560 పోస్టులు భర్తీ చేసేందుకు సన్నాహాలు చేశారు. ఇందులో వైద్యులు, స్టాఫ్‌నర్సులు, పారామెడికల్, నాన్ మెడికల్, నాల్గవ తరగతి ఉద్యోగుల పోస్టులు ఉన్నాయి. వీటిని కొన్ని రెగ్యులర్, మరికొన్ని కాంట్రాక్టు, ఇంకొన్ని అవుట్ సోర్సింగ్ విధానంలో భర్తీ చేసేందుకు విధి విధానాలు రూపొందించారు. ఇచ్చిన నోటిఫికేషన్లకు గాను అభ్యర్థుల నుంచి 20 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. ఈ క్రమంలో సాధారణ ఎన్నికలు రావడంతో పోస్టుల భర్తీకి బ్రేక్ పడింది. ఇందులో కొన్ని పోస్టులకు అప్పటికే దరఖాస్తుల పరిశీలన జరిగింది. పోస్టుల భర్తీకి సంబంధించి ప్రత్యేకంగా మెడికల్ కాలేజిలో బోర్డు ఏర్పాటు చేశారు. అక్కడే దరఖాస్తుల స్వీకరణ, వాటి పరిశీలన, మెరిట్ జాబితాల విడుదల కూడా జరిగింది. ఇక అభ్యర్థుల నియామక ప్రక్రియ ఒక్కటే మిగిలి ఉంది. ఈ పోస్టులు భర్తీ అయితే స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో వైద్యసేవలు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. అలాగే నంద్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజి, ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు మెరుగయ్యే అవకాశం ఉంది. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల, పీహెచ్‌సీలలో పలు పోస్టులు భర్తీ అయ్యే అవకాశం ఉంది.


ఉద్యోగాలకు దరఖాస్తు చేసేందుకు వచ్చిన అభ్యర్థులు (ఫైల్)

మేము చెప్పే వరకు భర్తీ చేయొద్దు!

వైద్యశాఖలో వివిధ కేటగిరీల్లో 560 పోస్టుల భర్తీకి సంబంధించి మెరిట్ జాబితాలు కూడా విడుదల అయిన నేపథ్యంలో ఇక ఎంపిక ప్రక్రియ ఒక్కటే లాంఛనమని అభ్యర్థులు భావించారు. ఈ మేరకు వివరాలను డీఎంఈ, ఇతర ఉన్నతాధికారులకు పంపించారు. కానీ ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చేంత వరకు ఉద్యోగాల భర్తీకి సంబంధించి ఎలాంటి ముందడుగు వేయొద్దని మౌఖిక ఉత్తర్వులు రావడంతో స్థానిక వైద్యశాఖ అధికారులు ఉద్యోగాల భర్తీ ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేశారు. రాష్ట్ర ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకే వీటిని ఆపేశారన్న చర్చ నడుస్తోంది. ఉద్యోగాల భర్తీకి సుముఖత చూపని తెలుగుదేశం ప్రభుత్వం ఈసారి కూడా పోస్టులు భర్తీ చేయకుండా అడ్డుకుంటుందేమోనని అభ్యర్థుల్లో ఆందోళన మొదలైంది. ఈ విషయమై కర్నూలు మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మను వివరణ కోరగా ఉద్యోగాలకు సంబంధించిన ప్రక్రియ జరుగుతోందని, ఉన్నతాధికారుల ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నామని చెప్పారు.

క్లుప్తంగా

డాక్టర్ ప్రియాంకకు బంగారు పతకం


సదస్సులో పాల్గొన్న డాక్టర్ సేపూరి ప్రియాంక

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు నగరానికి చెందిన సర్జికల్ ఆంకాలజిస్టు డాక్టర్ సేపూరి ప్రియాంకకు బంగారు పతకం లభించింది. ఇటీవల 2, 3, 4 తేదీల్లో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నో నగరంలో కింగ్ జార్జ్ మెడికల్ యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎండోక్రైన్ సర్జరీ సహకారంతో ది అసోసియేషన్ ఆఫ్ బ్రెస్ట్ సర్జన్స్ ఆఫ్ ఇండియా వారి 12వ వార్షికోత్సవ వైజ్ఞానిక సదస్సు అబ్సికాన్–2024 నిర్వహించారు. ఆమె హైదరాబాద్‌లోని ఎంఎన్‌జే క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ తరపున ఈ వైజ్ఞానిక సదస్సులో పాల్గొని ఉత్తమ స్థాయిలో పోస్టర్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఇందుకు గాను ఆమె జాతీయ స్థాయిలో కేజీఎంయూ బెస్ట్ పోస్టర్ అవార్డును పొందడమే గాక బంగారు పతకాన్ని సైతం సాధించారు. ఈమె కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో యూరాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

ముర్రుపాలతో శిశువుకు రక్షణ


ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

కర్నూలు(హాస్పిటల్): కాన్పు తర్వాత మొదటగా వచ్చే ముర్రుపాలలో వ్యాధినిరోధక శక్తి అధికంగా ఉంటుందని, తద్వారా బిడ్డలకు వ్యాధుల నుంచి రక్షణ కలుగుతుందని కర్నూలు మెడికల్ కాలేజీ ఎస్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అరుణ తెలిపారు. బుధవారం కర్నూలు మండలంలోని మునగాలపాడు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గర్భవతులు, తల్లులకు, తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అరుణ మాట్లాడుతూ.. తల్లి బిడ్డకు పాలు పట్టించే విధానం, తల్లి పాల ఆవశ్యకతను వివరించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్‌ఆర్ డాక్టర్ అలీ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు



రోడ్డుపై నిలిపిన వాహనాలను తీసుకెళ్తున్న ట్రాఫిక్ పోలీసులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సీఐ పి.గౌతమి హెచ్చరించారు. బుధవారం సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు నగరంలోని రాధాకృష్ణ థియేటర్ రోడ్డు నుంచి నెహ్రూ రోడ్డు, చౌక్ బజార్, మించిన్ బజార్లలో రోడ్డుపై నిలిపిన ద్విచక్రవాహనాలు, ఆటోలు, ఇతర వాహనాలను సీజ్ చేశారు. అలాగే ట్రాఫిక్ ఇబ్బంది కలిగించేలా ఉన్న రోడ్డు సైడ్ దుకాణాలు, బండ్లు, బంకులను తొలగించాలని నిర్వాహకులను ఆదేశించారు. తొలగించకపోతే కొత్త చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బీపీ మండల్ సిఫారసులు అమలు చేయాలి


బీపీ మండల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ నేతలు

కర్నూలు(అర్బన్) బీసీల అభ్యున్నతి కోసం బీపీ మండల్ కమిషన్ చేసిన సిఫారసులను కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని బీసీ సంఘాల నేతలు కోరారు. స్థానిక బీసీ భవన్‌లో బుధవారం బీపీ మండల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవపూజ ధనుంజయ ఆచారి, బీసీ జేఏసీ కన్వీనర్లు బత్తుల లక్ష్మీకాంతయ్య, అయ్యన్నయాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీసీల అభ్యున్నతి కోసం బీపీ మండల్ రూపొందించిన 40 సిఫారసుల్లో కేవలం ఒక్కటి (కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్) మాత్రమే అమలు చేస్తున్నట్లు ప్రకటించారన్నారు. మిగతా సిఫారసులను కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే బీసీ కుల గణన చేపట్టాలని, జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు, సంక్షేమానికి నిధులు మంజూరు చేయాలన్నారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి, విద్య, ఉద్యోగాల్లో న్యాయం చేయాలన్నారు. బీసీ సంఘాల నాయకులు రాంబాబు, కృష్ణయ్యయాదవ్, మధుయాదవ్, కృష్ణోజీరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గోదా జయంతి



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న మహిళలు, ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి గోదా సమేత వేంకటేశ్వర స్వామి

కర్నూలు కల్చరల్: కర్నూలు నగర శివారులోని గోదాగోకులంలో బుధవారం గోదా జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. ఉదయం నుంచే నిత్య ఆరాధన, తీర్థగోష్ఠి, మంగళ వాయిద్యాల నడుమ కైంకర్య పరులచే అష్టోత్తర శతకలశాలతో పూజా ద్రవ్యాలతో పూజలు నిర్వహించారు. గోదాదేవి అమ్మవారికి అష్టోత్తర శత కలశ స్నపన తిరుమంజనం నిర్వహించారు. పట్టు వస్త్రాలను సమర్పించారు. తోమాల సేవ నిర్వహించి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం కల్పించారు. వడి బియ్యం సారె సమర్పించారు. నాచ్చియార్ తిరుమొళి, తిరుప్పావై పాశురాల సేవ జరిగింది. ఊంజల్ సేవ, తిరుమాడ వీధుల్లో శ్రీ గోదాదేవి అమ్మవారికి గజవాహన సేవ ఘనంగా నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాద వితరణ గావించారు. గోదా గోకులం వ్యవస్థాపకులు ఎం.నాగరాజు గుప్త, సభ్యులు బాలసుధాకర్, పాలాది సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

- ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో గోదా దేవి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీ విష్ణు సహస్రనామ పారాయణంతో గోదా అమ్మవారికి పంచామృతాభిషేకం, అర్చన, తిరుప్పావై సేవ, పల్లకీ సేవ నిర్వహించారు. లలితా పీఠం వ్యవస్థాపకుడు మేడా సుబ్రహ్మణ్యం స్వామి సందేశమిచ్చారు. లలితా పీఠం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న సెబ్, ఎక్సైజ్ అసోసియేషన్ సభ్యులు

కర్నూలు: సెబ్, ఎక్సైజ్ విభాగాలకు చెందిన హెడ్ కానిస్టేబుళ్లు విజయభాస్కర్, చంద్రమౌళి, మృత్యుంజయుడు, కానిస్టేబుల్ ఆదాము విధి నిర్వహణలో మృతిచెందడంతో వారి కుటుంబాలకు సహోద్యోగులు అండగా నిలిచారు. ఉమ్మడి కర్నూలు జిల్లా కానిస్టేబుల్స్ అండ్ హెడ్ కానిస్టేబుల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేయిచేయి కలిపి రూ.2.98 లక్షలు వసూలు చేసి నాలుగు కుటుంబాలకు రూ.74,500 చొప్పున అందజేశారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్‌బాబు, ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రవికుమార్, ఏఈఎస్ వినోద్‌కుమార్, కర్నూలు సెబ్ సీఐ రాజేంద్రప్రసాద్ సమక్షంలో స్థానిక కార్యాలయంలో బుధవారం బాధిత కుటుంబాలకు నగదు అందించారు. సహోద్యోగులు ఆర్థిక సాయం అందించి అండగా నిలిచినందుకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.అసోసియేషన్ నాయకులు మధుసూదన్ రెడ్డి,ఓబులేసు, జగన్నాథం, ఫరూక్, విరుపాక్షి రెడ్డి, అయ్యన్న,వెంకటరాముడు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై నిరసన గళం


కలెక్టరేట్ ముట్టడికి వచ్చిన విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

కర్నూలు(సెంట్రల్): విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అఖండ, మహేంద్రబాబు హెచ్చరించారు. బుధవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ను ముట్టడించారు. అంతకుముందు గాయత్రీ ఎస్టేట్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా చేరుకుని ఆందోళన చేపట్టారు. కలెక్టరేట్‌లోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకొని మూడో పట్టణ పోలీసు స్టేషన్‌కు తరలించారు. దీంతో కలెక్టరేట్ పరిసరాల్లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలోని పలు పాఠశాలలు, హాస్టళ్లలో సమస్యలు తీవ్రంగా ఉన్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు లేకపోవడంతో అద్దె భవనాల్లో అరకొర వసతుల మధ్య కొనసాగుతున్నాయన్నారు. దాదాపు 70 శాతం హాస్టళ్లలో మరుగుదొడ్లు, స్నానపు గదులు లేవని చెప్పారు. విద్యార్థులు పుస్తకాలు, దుస్తులను పెట్టుకునేందుకు ట్రంకు పెట్టెలను అందించాలని, కాస్మోటిక్ చార్జీలను పెంచాలని, పెండింగ్‌లో ఉన్న నిధులను విడుదల చేయాలని, వార్డెన్, వంట మనుషులు, కమాటీ, ఇతర పోస్టులను భర్తీ చేయాని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండడం లేదని, కోడిగుడ్లు, పండ్లు ఇవ్వడం లేదన్నారు. కళాశాల విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజనం అందించాలని కోరారు. విద్యా కిట్లను ఇంత వరకు ఇవ్వకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలతో పాటు కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో ఖాళీలను భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. విశ్వవిద్యాలయాల్లో వెంటనే ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. నాయకులు రమణ, నరేష్, రసూల్, రామకృష్ణ, ప్రశాంత్, వీరేష్, కిరణ్, మహేష్ పాల్గొన్నారు.

చేనేత వస్త్రాలపై జీఎస్టీ రద్దు చేయాలి

కర్నూలు(సెంట్రల్): చేనేత వస్త్రాలపై విధిస్తున్న జీఎస్టీని రద్దు చేయాలని ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ జిల్లా చైర్మన్ నక్కలమిట్ట శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట చేనేత సంఘాల ఆధ్వర్యంలో 10వ జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేనేతలను ఆదుకోవడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. చేనేత వస్త్రాల ముడి సరుకులు, ఇతర అవసరాల కోసం ఏటా రూ.25 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చేనేత దుస్తుల తయారీ, విక్రయాలకు ప్రభుత్వం సహరించాలని కోరారు. నాయకులు చింతా శ్రీనివాసులు, శకుంతల, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

శక్తిసదన్ పరిశీలన

కర్నూలు (లీగల్): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి బుధవారం ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లోని మహిళా ప్రాంగణం (శక్తిసదన్)ను సందర్శించారు. ఆ కార్యాలయాలకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించి అక్కడి సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు, పరిశుభ్రతను పరిశీలించి వారు ఎదుర్కొంటున్న సమస్యల గురించి తెలుసుకున్నారు. అక్కడి వారికి లీగల్ సర్వీసెస్ యాక్ట్ – 1987 ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందేందుకు అర్హులని తెలిపారు.


శక్తిసదన్‌లో రిజిస్టర్లను పరిశీలిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి

ఈ-పంట నమోదుపై సమీక్ష

కర్నూలు(అగ్రికల్చర్): పంట సాగు చేసిన వ్యక్తి పేరుతోనే ఈ-పంట యాప్‌లో వివరాలు నమోదు చేయాలని వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్ జిల్లా యంత్రాంగానికి సూచించారు. ఆయన బుధవారం గుంటూరు నుంచి వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంట సాగుదారు పేరిట వివరాలు నమోదు చేయడం వల్ల భూయజమానికి నష్టం జరగదని వివరించారు. వ్యవసాయ, రెవెన్యూ శాఖ జాయింట్ అజమాయిషి కింద పంటలను నమోదు చేయాలని సూచించారు. షెడ్యూలు ప్రకారం సెప్టెంబరు 15వ తేదీలోపు ఈ-కేవైసీ సహా పంటల నమోదు పూర్తి చేయాలని ఆదేశించారు. పారపాట్లకు తావు లేకుండా పంటల నమోదు చేపట్టాలని, నమోదు ప్రక్రియను ఏఓ, ఏడీఏలు, ఉద్యాన అధికారులు పర్యవేక్షించాలన్నారు. కర్నూలు నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి, ఏడీఏలు సాలురెడ్డి, మహమ్మద్ ఖాద్రి, అరుణకుమారి, సునీత, అగ్రానమీ ఏడీఏ బాలవర్ధిరాజు తదితరులు పాల్గొన్నారు.

నిరసనలకు పిలుపు

కర్నూలు(సెంట్రల్): ఆగస్టు 9న క్విట్ ఇండియా దినోత్సవం పురస్కరించుకొని అన్ని మండల కేంద్రాల్లోని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల వద్ద నిరసన తెలపాలని రౌండ్ టేబుల్ సమావేశంలో నిర్ణయించారు. బుధవారం సీఆర్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, వివిధ సంఘాల నాయకులు జి.రామకృష్ణ, కె.నారాయణ, సుంకన్న, మహ్మద్‌సాహెబ్ హాజరయ్యారు. కేంద్రంలోని ప్రజా వ్యతిరేక బీజేపీ ప్రభుత్వం గద్దె దిగాలని పిలుపునిస్తూ 9న నిరసనలకు పిలుపునిచ్చారు.

9 నుంచి విలువిద్య శిక్షణ

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు సీబీఎస్‌ఈ స్కూల్ విద్యార్థులకు విలువిద్య క్రీడాంశంలో నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా విలువిద్య సంఘం కార్యదర్శి కే.రాగరత్నమయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణలో విలువిద్యకు సంబంధించిన మెలకువలు నేర్పిస్తారని చెప్పారు. ప్రతిభ చూపిన క్రీడాకారులు ఈ నెల14 నుంచి 19వ తేదీ వరకు సీబీఎస్‌ఈ పోటీల్లో పాల్గొంటారని, వివరాలకు 93938 55460సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

బాధ్యతల స్వీకరణ

కర్నూలు(అగ్రికల్చర్): విజయ డెయిరీ కర్నూలు మిల్క్ యూనియన్ మేనేజర్‌గా ఎన్.వివేకానంద నియమితులయ్యారు. డెయిరీ నంద్యాల ప్రధాన కార్యాలయంలో ప్రొక్యూర్‌మెంట్ విభాగంలో పని చేస్తున్న ఈయన్ను పాలకవర్గం ఆదేశాల మేరకు కర్నూలు డెయిరీ మేనేజర్‌గా నియమిస్తూ ఎండీ ప్రదీప్‌కుమార్ మూడు రోజుల క్రితమే ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు.

మోగిన పెళ్లి బాజా

- మూఢానికి ముగింపు.. ముహూర్తాలకు వేళాయె
- మూడు నెలల విరామం తర్వాత పెళ్లిళ్ల సందడి మరూ
- శ్రావణమాసంలో శుభకార్యాలకు ఏర్పాట్లు
- నేటి నుంచి శుభ ముహూర్తాలు
- ఫంక్షన్‌హాళ్లు, డెకరేషన్, వంట మాస్టర్లకు ఫుల్ గిరాకీ


అలంకరించిన కల్యాణ వేదిక

కర్నూలు కల్చరల్: జీవితంలో పెళ్లి ఓ మధురానుభూతి. అందుకే అందరూ మెచ్చేలా అత్యంత వైభవంగా జరుపుకోవాలని భావిస్తుంటారు. కాస్త ఆలస్యమైనా అన్నీ సవ్యంగా కుదిరాకే పెళ్లిళ్లు చేసుకుంటారు. మూడు నెలల విరామం తరువాత ముహూర్తాలు ఉండడంతో మళ్లీ కల్యాణ బాజా మోగనుంది. మూఢం కారణంగా నిలిచిపోయిన పెళ్లిళ్లు, శ్రావణ శుద్ధ తదియతో మళ్లీ జరగనున్నాయి. ఇప్పటికే శుభ ముహూర్తాలు నిర్ణయించుకున్న పెళ్లి బృందాలు ఏర్పాట్లలో నిమగ్నమయ్యాయి. ఎక్కడ చూసినా కల్యాణ మండపాలు ముందుగా బుక్ అయ్యాయి. ఈ నెల 7వ తేదీ నుంచి వరుస ముహూర్తాలు ఉండడంతో చాలా మంది వివాహాలు, గృహ ప్రవేశాలు, ఎంగేజ్‌మెంట్‌లు, నిర్మాణ ముహూర్తాలు చేసుకున్నారు.

శ్రావణం.. శుభప్రదం

శ్రావణ మాసం శుభప్రదం. ఈ రోజుల్లో ప్రతి గడియా లక్ష్మీకటాక్షమే. ప్రతి తిథి దివ్య ముహూర్తమే. ఏకార్యం మొదలు పెట్టినా శుభకరమే. నెలంతా ఆధ్యాత్మికంగానే ప్రజలు భావిస్తారు. అందుకే శ్రావణ మాసానికి అంతటి ప్రాముఖ్యం ఉంది. ఈ మాసంలో మంగళ, శుక్ర, శనివారాలను పవిత్రంగా చూస్తారు. శ్రావణ సోమవారం శివునికి, మంగళవారం మంగళ గౌరికి, శుక్రవారం లక్ష్మీ ప్రసన్నం కోసం లక్ష్మీదేవికి , శనివారం వేంకటేశ్వర స్వామికి పూజలు చేస్తారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉరుకుంద ఈరన్న దేవస్థానం, శ్రీశైలం, మహానంది, యాగంటి, మంత్రాలయం తదితర క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి.

పూజలు.. పండుగలు

శ్రావణ మాసంలో పర్వదినాలు అధికంగా ఉన్నాయి. ఈనెల 8వ తేదీన చతుర్థి వ్రతం, 9న నాగ పంచమి, 16న వరలక్ష్మీ వ్రతం, 19న రాఖీ పౌర్ణమి, 27న శ్రీకృష్ణాష్టమి ఉన్నాయి. ఈ నెల 12, 19, 26, సెప్టెంబర్ 2న శ్రావణ సోమవారాలు, 9, 16, 23, 30, తేదీల్లో శ్రావణ శుక్రవారాలు, అలాగే 10,17, 24, 31 తేదీల్లో శ్రావణ శనివారాలు ఉన్నాయి. ఈ రోజుల్లో పూజలు, ప్రత్యేక కార్యక్రమాలతో భక్తులు ఆధ్యాత్మిక భావనతో గడపనున్నారు.

మళ్లీ మంచి రోజులు

ఏప్రిల్ 27 నుంచి మొదలైన శుక్ర మౌఢ్యమి జూలై 6న ఆషాఢ శుద్ధ పాడ్యమి వరకూ ఉంది. ఇది ఉండగానే మే 5వ తేదీ నుంచి గురు మౌఢ్యమి మొదలైంది. మూడు నెలలు శుభ కార్యక్రమాలు లేక వాటిపైనే ఆధారపడిన వివిధ వృత్తిదారులు, వ్యాపారులు ఇబ్బంది పడ్డారు. మండపాలు ముస్తాబు చేసే వారు మొదలుకొని పురోహితులు, ఫొటో, వీడియో గ్రాఫర్లు, ఈవెంట్ల నిర్వాహకులు, వస్త్ర దుకాణదారులు, పూలు, పండ్ల వ్యాపారులు, ప్రింటింగ్ ప్రెస్ నగల దుకాణాలు, క్యాటరింగ్ వంటి వారికి గట్టి దెబ్బ తగిలింది. ఆయా వ్యాపారాలకు శ్రావణంతో తిరిగి నూతన శోభ రానుంది.

ముహూర్తాలు ఇలా..

శ్రావణ మసంలో ఈనెల 7వ తేదీ నుంచి వివాహ ముహూర్తాలు ఉన్నాయి. శ్రావణ మాసం సెప్టెంబర్ 3వ తేదీతో ముగియనుంది. కానీ అమావాస్య ముందు ఈ నెల 31వ తేదీ వరకే శుభకార్యాలకు అనువుగా ఉంటుందని పండితులు చెబుతున్నారు. 8, 9, 10, 11, 14, 15, 16, 18, 19, 21, 22, 23, 24, 28, 30, 31 తేదీల్లో వివాహ ముహూర్తాలు ఉన్నాయి. సెప్టెంబర్ 3 నుంచి శూన్య మాసం కారణంగా అక్టోబర్ 2వ తేదీ వరకు శుభ ముహూర్తాలు ఉండవు. తిరిగి ఆశ్వీయుజ మాసం అక్టోబర్ 3 నుంచి డిసెంబర్ 26 వరకు ముహూర్తాలు ఉన్నాయి. డిసెంబర్ 31 నుంచి 2025 జనవరి 29 వరకు పుష్య మాసం (శూన్య మాసం) కావడంతో ముహూర్తాలు లేవు.

సరికొత్త పోకడలు

గతంలో వివాహ వేడుకలు అంటే బ్యాండ్ మేళాలు, భాజా భజంత్రీలు, పూల మండపాలు, వీడియో షూటింగ్‌లు వంటివి చాలా కామన్‌గా ఉండేవి. ఇప్పుడు పూర్తిగా ట్రెండ్ మారింది. వివాహ ముహూర్తానికి ముందే సంగీత్ కార్యక్రమాలు నిర్వహించడం, ప్రీ వెడ్డింగ్ షూట్ల కోసం ఇతర లోకేషన్లకు, ప్రకృతి, చారిత్రక ప్రాంతాలకు వెళ్తున్నారు. సినిమాటిక్‌గా వధూవరులచే స్పెషల్ సాంగ్స్ రూపకల్పన చేసి అవి ముందుగానే సోషల్ మీడియాలో విడుదల చేయడం, కల్యాణ వేదికపై ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ తెరలపై ప్రదర్శించడం ఇలా విభిన్నంగా వేడుకలను నిర్వహిస్తున్నారు.

పెళ్లిళ్ల సీజన్ ప్రారంభం



పెళ్లిళ్ల సీజన్ ప్రారంభమైంది. మూడు నెలలుగా మౌఢ్యం కారణంగా శుభ గడియలు, పెళ్లి ముహూర్తాలు లేవు. శ్రావణ మసంలో ఈనెల 7వ తేదీ రాత్రి నుంచి పెళ్లిళ్ల సీజన్ ప్రారంభమవుతుంది. శుభ కార్యాలకు మూడు నెలల విరామం రావడంతో ఈ సారి అధిక మొత్తంలో పెళ్లిళ్లు జరగనున్నాయి.

– అగ్రహారం రాఘవేంద్ర ఆచార్యులు, ఆగమ పండితులు, కర్నూలు

వేలాది మందికి ఉపాధి



మూడు నెలల పాటు ముహూర్తాలు లేక ఖాళీగా ఉన్నాం. శ్రావణ మాసం ప్రారంభం కావడంతో శుభకార్యాలు అధికంగా ఉంటాయి. ఈ మాసంలో ప్రతి రోజు ఏదో ఒక శుభకార్యం ఉంటుంది. దీనిపై ఆధారపడి జీవనం సాగించే అన్ని రకాల వారికి చేతి నిండా పని ఉంటుంది. మాకు కూడా ఈ నెలంతా ఆర్డర్స్ ఉన్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా అనేక మందికి ఉపాధి దొరకుతుంది.

– ప్రేమ్, క్యాటరింగ్ నిర్వాహకుడు, కర్నూలు